జగనన్నే మా భవిష్యత్



తంగెళ్ళమూడిలో జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు



సుద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ

సుద్దపల్లి(చేబ్రోలు): రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, రాష్ట్రాభివృద్ధి, భవిష్యత్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ అన్నారు. మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలు గురించి తెలుసుకోవటంతో పాటు, ఇతర సమస్యలను తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌లను అంటించారు. స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజలలో నమ్మకం, విశ్వాసాన్ని కలిగించే విధంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ నాయకులు మట్టుపల్లి పోతురాజు, బి.గోవిందరాజులు, జేసీఎస్ కన్వీనర్‌లు మైలా హనుమంతరావు, కె మౌనిక, ఎం వెంకటేశ్వర్లు, తెనాలి సుధాకర్, డి గోపి, పీటర్‌పాల్, రత్నరాజు, స్టాలిన్, సునీత, ప్రభుదాసు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తంగెళ్ళమూడిలో...

పెదకాకాని: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి పెదకాకాని మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు శ్రీకారం చుట్టారు. మండలంలోని తంగెళ్ళమూడి గ్రామంలో సోమవారం ప్రతి ఇంటికీ వెళ్ళి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వివరించారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలు, మేలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఇంటి యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లను అంటించి వారి కుటుంబ పెద్ద సెల్ నెంబర్ నుంచి మిస్డ్ కాల్ ఇప్పించి ఆ కుటుంబ సభ్యుల అనుమతి తీసుకొని వారి అభిప్రాయంతో వీడియోలు, ఫొటోలు చిత్రీకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సర్పంచి జిల్లెళ్ళ కిషోర్, మాజీ సర్పంచి బోజంకుల ఏసోబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందన సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



చేబ్రోలు: స్పందనలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే రోశయ్య సూచించారు. పాసుపుస్తకాల కోసం, ధ్రువీకరణ పత్రాల కోసం మొత్తం నాలుగు అర్జీలు అందాయి. గ్రామాల నుంచి వచ్చిన రెవెన్యూ ఇతర అర్జీల గురించి తహసీల్దారు సుజాతతో సమీక్షించారు. ఎంపీడీవో బాబురావు, ఈవోపీఆర్డీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో ఉచిత వైద్య శిబిరం

పెదనందిపాడు: బుధవారం పెదనందిపాడులో కాటూరి హాస్పటల్స్ అండ్ మెడికల్ కళాశాల అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ చల్లా మోహన్‌రావు మాట్లాడుతూ పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఈసీజీ, ఆర్‌బీఎస్, ఎల్‌పీటీ, సెరమ్, బీపీ, బీఎండీ, పీఎఫ్‌టీ, సీబీపీ తదితర టెస్టులు చేస్తారని, ఆరోగ్య శ్రీ కార్డులు లేని వారికి కూడా పరీక్షలు చేస్తామన్నారు.

బీమా నగదు అందజేత



నగరం: నగరం గ్రామానికి చెందిన సనకా వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నగదును సోమవారం కుటుంబ సభ్యులకు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అందించిన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, ఎంపీటీసీ ఉప్పాల వెంకటేశ్వరావు, వేల్ఫేర్ అసిస్టెంట్ కుందన పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

రేపల్లె రూరల్: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పార్థసారధి కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ అంశాన్ని పరిశీలించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు ఫిర్యాదు అందించారన్నారు. అదేవిధంగా 28వవార్డులో శిథిలావస్థకు చేరిన గృహం నుంచి విష పురుగుల సంచారం అధికంగా ఉందని, యజమానితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఒక అర్జీ అందిందన్నారు. తనకు తెలియకుండా తనపేరుపై ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను తొలగించాలని ఒక పిర్యాదు అందిందన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆయాశాఖల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

పీహెచ్‌సీకి కుర్చీలు బహుకరణ

భట్టిప్రోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌ఛార్జ్ విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సాఆర్) సోమవారం 6 కుర్చీలను అందచేశారు. కుర్చీలను అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వాసవీక్లబ్, సత్యసాయి బాబా ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన నిర్వ హించారు. ముందుగా గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు.

కాకుమానులో ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కాకుమాను: మండలం కేంద్రం కాకుమానులో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కన్నుల పండువలా జరిగింది. ఉదయాన్నే స్వామి వారి దంపతులను పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్, గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త నల్లమోతు (ఏరీస్) రత్తయ్య దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, తెలగాయపాలెం సర్పంచ్ చింతల రాహేలమ్మ, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఏర్పాట్లను దేవాలయ ఈఓ అశోక్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం మేకతోటి దయాసాగర్ కొండపాటూరులో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు గేరా పున్నారావు, తదితరులు ఉన్నారు.



స్వామివారి దంపతులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మేకతోటి దయా సాగర్

వెల్లటూరులో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన

వెల్లటూరు(భట్టిప్రోలు): మండల పరిధిలోని వెల్లటూరు శ్మశానవాటికకు చేరుకునేందుకు రూ. 10 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులను సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ శ్మశానవాటికకు చేరుకోవాలంటే నానాయాతనలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఐతే పడరాని తిప్పలు పడాల్సి వచ్చేది. దళితవాడ వాసుల చిరకాల కోరికను తీర్చేందుకు సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ముందుకు వచ్చారు. ఇందుకు రూ. 10 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేయించారు. వంతెన నిర్మాణ పనులకు పాస్టర్లు సీహెచ్ స్టీవెన్‌సన్, డేవిడ్ జె. జోసెఫ్, ఫరీద్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మేరుగ చలంబాబు, దాసరి రామారావు, చీకటి కోటేశ్వరరావు, దాసరి రామారావు, డొక్కా రామారావు, నున్నం ఆనంద్, పంచాయతీ రాజ్ ఎఈ కె. శేతు రామచంద్రరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె. అనిల్ పాల్గొన్నారు.



వెల్లటూరులో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పాస్టర్లు, సంఘ పెద్దలు

హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ విధానం

తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు

నెహ్రూనగర్: నగరంలోని హోర్డింగ్స్ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి ప్రకటన బోర్డ్ నగరపాలక సంస్థకు ఫీజులు చెల్లించేలా సమగ్ర క్యూఆర్ కోడ్ విధానాన్ని సోమవారం పట్టణ ప్రణాళిక అధికారులు తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తొలి విడతగా బకాయిలు చెల్లించిన వారి బోర్డులకు కోడ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక నుంచి కోడ్ లేని బోర్డుల్ని తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని చెప్పారు. బోర్డులకు ఏర్పాటు చేసే కోడ్‌లను మరొక చోట ఏర్పాటు చేయడానికి వీల్లేకుండా లాంగిట్యుడ్, లాటిట్యూడ్‌లో లోకేషన్ కేటాయింపు ఉంటుదని పేర్కొన్నారు. నగరంలో అన్ని యాడ్ ఏజెన్సీలు, వ్యక్తిగత బోర్డులు కల్గిన వారు తప్పనిసరిగా బకాయిలు చెల్లించి క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీ బాబూరావు, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ అమరుస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు

రూపేష్ మక్వానాకు ఘన స్వాగతం

గుంటూరు ఎడ్యుకేషన్: రన్ ఫర్ సేవ్ యూత్-సేవ్ నేషన్ నినాదంతో 95 రోజుల్లో ఆరువేల కిలోమీటర్ల పరుగు చేపట్టిన గుజరాత్ వాసి రూపేష్ మక్వానా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. మిర్చి యార్డు రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం సాయంత్రం రూపేష్ మక్వానాను కలిసిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి. సాయిచరణ్ గుప్తా మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ప్రారంభించిన పరుగు తిరిగి ఢిల్లీకి చేరుకునే లక్ష్యంతో రోజుకు 70 కిలోమీటర్లకు పైగా రూపేష్ మక్వానా పయనిస్తూ మార్గంమధ్యంలో గుంటూరుకు వచ్చారని చెప్పారు. ఆగిన చోటల్లా గ్రామాలు, నగరాల్లోని కళాశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని చైతన్య పర్చేందుకు ప్రయత్నిస్తూ, తలచుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను ఉత్తేజపరచి, వారిలోని నైపుణ్యాల్ని వెలికితీయాలనే ఉద్దేశంతో తన విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. యువతరం రూపేష్ మక్వానా వంటి వ్యక్తుల్ని ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దివాకర్, నగర కార్యదర్శి శ్రీకాంత్, ఉదయ్, కార్తీక్ పాల్గొన్నారు.



రూపేష్ మక్వానాకు అభినందనలు తెలియజేస్తున్న ఏబీవీపీ నేతలు

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తెనాలి రూరల్: ప్రైవేటు వైద్యశాలలో సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వైద్యులు పోలీసుల్ని కోరారు. పట్టణ పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ వైద్యశాలకు అపస్మారకస్థితిలో ఉన్న ఓ పాపను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. వైద్యం సరిగా చేయడంలేదని డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో పాటు సిబ్బందిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోటినాగయ్య, వైద్యులు టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావును సోమవారం కలసి దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): వ్యవసాయ సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా సోమవారం ఏట్రవారిపాలెం సచివాలయం వద్ద రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా తైవాన్ స్ప్రేయర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపు రైతులకు సబ్సిడీలో ట్రాక్టరు, 4 తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ పథకంలో బ్యాంకు రుణం 50శాతం, ప్రభుత్వ సబ్సిడీ 40శాతం పోను రైతులు 10శాతం నగదు చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి డి.పద్మావతి, నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి, గ్రామ వలంటీర్లు తదితరులు ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చెరుకుపల్లి: పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాస్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో గుళ్ళపల్లి గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామ సమీపంలోని కాల్వ కట్టపై నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద ఉన్న పేక ముక్కలను, రూ.1100ల నగదును స్వాధీనం చేసుకుని చెరుకుపల్లి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు.

సీఎం జగన్ నాయకత్వంలో సంక్షేమ పాలన

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతోందని 56వ డివిజన్ కార్పొరేటర్ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా విభాగం నాయకురాలు షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటాద్రిపేటలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ నేతలు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అని లబ్ధిదారులు అడిగి తెలుసుకున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజిల అధికారులకు సూచించారు. ఆమె సోమవారం తూర్పు నియోజకవర్గం 7వ డివిజన్ పరిధిలో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ నుంచి మాయాబజార్ చర్చి వరకు రూ. 35 లక్షలతో జరుగుతున్న కల్వర్టు పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ షౌకత్, డీఈ శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ రోహితకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు



గుంటూరు మెడికల్: నగరానికి చెందిన జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చిటితోటి రోహితకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ట్రస్టు ఇంటర్నేషనల్ సంస్థ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందజేసింది. డాక్టర్ రోహిత చిత్తశుద్ధితో చేస్తున్న ఉత్తమ వైద్య సేవలకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమె మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ రోహితకు రేడియాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిటితోటి కిశోర్‌కుమార్, గుంటూరుకు చెందిన పలువురు రేడియాలజిస్టులు, జనరల్ ఫిజిషియన్లు సోమవారం అభినందనలు తెలిపారు.

ఇఫ్తార్ టైం.....



పొన్నూరు మర్కజ్ మసీద్ వద్ద ఏర్పాటు చేసిన ముస్లిం ఆధ్యాత్మిక మత ప్రార్థనలో సోమవారం పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. స్థానిక ఇటికంపాడురోడ్డులోని మసీద్ వద్ద ఎంఎం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కిలారి పాల్గొని ముస్లిం, మైనార్టీ సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మత పెద్దలు ఏర్పాటుచేసిన మత ప్రార్థనలో పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే భోజనాలను వడ్డించి ప్రారంభించి అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనారిటీ కమీషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడె షేక్ మాము, ఎంఎం యూత్ సభ్యులు, జానీ భాష, అక్బర్ వలి, వలి బాషా, మత పెద్దలు, ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, అల్లా భాషా, బొద్దులూరి రంగారావు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. -పొన్నూరు(చేబ్రోలు)

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఐలవరం విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వియత్నాంలోని హోచీమింగ్ సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ కానెన్ఫరెన్స్‌కు వర్చువల్‌గా హాజరయ్యారు. సుమారు 8 దేశాలు పాల్గొన్న ఈ కాన్ఫరెన్స్‌కు భారతదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం విద్యార్థులు ప్రాతినిథ్యం వహించారు. ఈ సందర్భంగా ఐలవరం విద్యార్థులు ఏపీలోని నూతన విద్యా సంస్కరణలు, తమ పాఠశాలలో అవలంభిస్తున్న వినూత్న కార్యక్రమాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమానికి మలేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, కంబోడియా, జపాన్, సౌత్‌కొరియా, శ్రీలంక దేశాలు వారి విద్యా రంగంలో వస్తున్న మార్పులను గూర్చి వివరించారు. వియత్నాం దేశంలోని విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి 500ల మందికి పైగా విద్యా శాఖాధికారులు హాజరయ్యారు. ఐలవరం విద్యార్థులు రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చాలా మందిని ఆకర్షించడమే కాక ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ మిగిలిన దేశాల ఉపాధ్యాయులు పాల్గొని వారి దేశాలలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను వివరించారు.



హాజరైన భట్టిప్రోలు విద్యార్థులు, వివిధ దేశాల విద్యా శాఖాధికారులు

85 మందికి వైద్యసేవలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఇండయన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన అనుమై బేబీ ఆసుపత్రి వారిచే సోమవారం తల్లి-బిడ్డల వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ వైస్‌చైర్మన్ డాక్టర్ వేజళ్ల పూర్ణానంద్ ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు సుజాత, మణిలు గర్భిణీలు, 85 మంది బాలింతలు, గర్భిణులు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన గర్భిణీలు, బాలింతలకు సత్యసాయి సేవా సమితి సభ్యులు రొట్టెలు, పాలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, నగరం మెడికల్ ఆఫీసర్ సురేంద్రనాథ్, మార్కెటింగ్ మేనేజర్ అనిల్ కుమార్, సొసైటీ సభ్యులు మోపిదేవి వెంకటేశ్వరరావు, అడుసుమల్లి ప్రభాకర్ రావు, సయ్యద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

భట్టిప్రోలు: మొక్కజొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో భాగంగా ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్యకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వి.వెంకట్రామయ్య మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు మద్దతు ధర రూ. 1960 నిర్ణయించిందని...ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండవ నాగేశ్వరరావు, జి.నాగరాజు, ఎం. సత్యన్నారాయణ, జి. సుధాకర్, డి. సత్యన్నారాయణ, వేములపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందచేస్తున్న ఏపీ రైతు సంఘం నిర్వాహకులు

డాక్టర్ నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు

గుంటూరు మెడికల్: నగరానికి చెందిన సీనియర్ స్పైన్ సర్జన్, మల్లికా స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ వెయిట్ బేరింగ్ సొసైటీ నాలుగో అంతర్జాతీయ సదస్సు ఢిల్లీలో ఇటీవల నిర్వహించారు. ఇందులో స్టాండింగ్ ఎమ్మారైలో డాక్టర్ నరేష్‌బాబు చేసిన మూడు పరిశోధనలకు వెయిట్ బేరింగ్ సొసైటీ అవార్డును అందజేసింది. ఈ విషయాన్ని సోమవారం గుంటూరు కొత్తపేటలోని మల్లికా స్పైన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేష్‌బాబు వివరాలు వెల్లడించారు. కీ హోల్ సర్జరీ విధానంలో అతి చిన్న గాటుతో స్పైనల్ ఫిక్సేషన్ చేసే సమయంలో ఎవరికి ఆపరేషన్ విజయవంతంగా చేయవచ్చనే విషయాన్ని నిల్చొని తీసే ఎమ్మారై ద్వారా తాను సమర్పించిన పరిశోధనకు అవార్డును అందజేశారని వివరించారు. నిల్చున్నప్పుడు, పడుకున్నప్పుడు వెన్నుపూసకు రక్త సరఫరా, కూర్చొని మెడ వంచి ఎమ్మారై తీయడం ద్వారా ఎలాంటి సమస్యలు నివారించవచ్చనే విషయాలపై తాను పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు. స్పెయిన్ దేశానికి చెందిన రేడియాలజిస్ట్ ప్రొఫెసర్ కాయ్ విలనోవా చేతుల మీదుగా అంతర్జాతీయ అవార్డును అందుకున్నట్లు డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ నరేష్‌బాబుకు గుంటూరుకు చెందిన సీనియర్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, సీనియర్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, గుంటూరు బోన్ క్లబ్‌కు చెందిన పలువురు ఆర్థోపెడిక్ సర్జన్స్ సోమవారం అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ సోమవారం కొత్తపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ శీలం శ్రీనివాసరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతోపాటు ఈస్ట్ డీఎస్పీ సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.